# మధుర స్వప్నం

కిరణ్‌బాల

బస్‌స్టాప్‌లో నిలబడ్డాను. రద్దీలేదు. చుట్టు పక్కలంతా తప్పని సరి పరిస్థితుల్లో ప్రయాణంచేసే నాలాంటి ఉద్యోగస్థులే కనబడ్డారు.

బస్ వచ్చింది బస్‌లో సీట్లున్నంతమేర జనం కూర్చున్నారు. ముగ్గురు ఆడవాళ్ళు తాముకూర్చున్న సీట్లు సర్దుకొని నాకు స్థలమిచ్చారు. కిటికీలోంచి బయటకు చూస్తున్నాను.

మా ఊరి రోడ్డేంటి ఇంత మారిపోయింది? తారు రోడ్డయింది. రోడ్డు కిరువైపులా పెద్ద పెద్ద వృక్షాలు, "అశోకుడు రహదారుల కిరువైపులా చెట్లు నాటించెను." అని చిన్నప్పుడు సాంఘికశాస్త్రంలో చదువుకున్నది జ్ఞాపకం వచ్చింది.

ఎటు చూసినా పచ్చనిపైర్లూ, వరి, పొద్దు తిరుగుడు పంటలు

"నిన్నలేని అందమేదో నిదురలేచె నెందుకో..." ఘంటశాల గీతాన్ని ఆలపిస్తూంది నా అంతరంగం.

హఠాత్తుగా ఒక్కరోజులో ఎంత మార్పు వచ్చేసింది! ఇది ఏ మాంత్రికుడి మాయాజాలమో?

బస్ దిగినడుస్తున్నాను. ఊరివెలుపలే పశువుల కొట్టాలు, దార్లో గొర్రెల మందలు ఎదురయ్యాయి.

కొద్దిసేపైన తర్వాత ఎదురుగా కరణంగారు కాలినడకన దర్శనమిచ్చారు. ధోవతీ, లాల్చీ, ఉత్తరీయం... ఆయనలో తెలుగు సంప్రదాయం పుట్టిపడు తూంది.

వెనుక సన్నాయిమేళం! కొందరు కన్నెముత్తయిదువలు సర్వాలంకార భూషితులై మంగళారతులు పట్టుకొని నడుస్తున్నారు.

సన్నాయివాళ్ళు "రారా మా ఇంటిదాకా..." కీర్తనని ఆలపిస్తున్నారు.

ఎంత మధురమైన సన్నివేశం! కరణంగారి అన్నకూతురి పెళ్ళంట. పెళ్ళికొడుకుని ఎదురేగి - తీసుకుని రావడానికి వెళ్తున్నారట. శుభం!

చకచకా నడుస్తున్నాను. రోడ్డుకి ఆ వైపున పంటభూమి. పసుపు కొమ్ముల రాశులుపోసి ఉన్నాయి. రైతుల మాటలు వినిపిస్తున్నాయి.

"ఈ రోజు పసుపు ఉడకబెట్టొద్దురా"

"అవు మర్చిపోలే. మా వోళ్ళు పొద్దుగల్నే యాజ్జేసిన్రు. ఈరోజు వానొచ్చే రోజని."

ఆ సంభాషణ విని ఎంతో ఆశ్చర్యపోయాను

ఈ రోజు వర్షం వస్తుందని వీళ్ళకి ముందే తెల్సా? ఎప్పుడో శ్రీరాముడి కాలంలో నెలకి మూడు వానలు కురిశాయంట.

నిజంగానే రామ రాజ్యం వచ్చేసిందా?

నడుస్తున్నాను, ఊరు దగ్గరకొచ్చింది.

ఎనిమిది గిలకల మంచినీళ్ళ బావి దగ్గర ఓ చిన్న మహిళా లోకం. అమ్మాయిలు కొందరు బిందెలతో నీళ్ళు తీసుకువెళ్తున్నారు.

సర్పంచిగారి భార్యా, గ్రామ పెద్దగారి కూతురూ, ఇంకా కొందరు పడుచులు బావిలో బొక్కెనలు వేసి నీళ్ళు చేదుతున్నారు. ఇలా వేసి, అలా తీస్తున్నారు. అంటే నీళ్ళు ఎంత సమృద్ధిగా ఉన్నాయో!

స్త్రీల గాజుల సవ్వడీ గజ్జెల చప్పుడూ, బావి గిలక శబ్దంతో కలిసిపోయి, ఆ పరిసరాల్లో ఒక వింత శబ్దాన్ని సృష్టిస్తున్నాయి.

నాకు 'బావిలో నీళ్ళుండటం' ఒక ఆశ్చర్యం. అవి 'నిండుగా ఉండటం' మరింత ఆశ్చర్యం!

రాత్రికి రాత్రి [illegible] 'అల్లాఉద్దీన్ అద్భుత దీపం' దొరకలేదు కదా!

ఓహో గ్రామమెంత బాగైపోయింది!

కరణంగారి అన్నగారిల్లు పెళ్ళిపందిరితో, కళకళ లాడుతోంది. ఎక్కడ చూసినా పచ్చని



తోరణాలు.

పడుచుల అందెల రవళికి, వారి పకపక నవ్వులు వంతపాడుతున్నాయి. పిలుపులూ - కేకలూ, పిల్లల అల్లరీ - ఆటలూనూ...

ఎవరో రెండు గంపలనిండా బొండుమల్లెలు తెచ్చిపెట్టారు. మరెవరో అరటిగెలలు పట్టుకొచ్చి అరుగుమీద పెట్టారు.

మరిద్దరు బానల నిండా చిక్కటి పెరుగుని పట్టుకొస్తున్నారు. దారిలో ఈ రమణీయ దృశ్యాన్ని తిలకించిన నాకు ఋతురాజు ఇక్కడే విహరిస్తున్నాడా! అనిపించింది.

మా 'పాఠశాల' అదిగో వచ్చేసింది. పాడుబడ్డ బిల్డింగ్ స్థానంలో ఓ నూతన భవనం వెలసింది.

అదిగో, స్కూల్ బోర్డు. 'జిల్లా (ప్రజా) పరిషత్ ఉన్నత పాఠశాల'! ఈ ఉన్నత పాఠశాలనే ఏదో 'ఉన్నంత (లో)' పాఠశాల అనుకొని తృప్తిగానే గడుపుతున్నాం.

మా ప్రధానోపాధ్యాయులుంగారు 'ప్రజా' అనే విలువైన పదాన్ని కుండలీకరణంలో పెట్టించారు. ఎందుకో తెలుసా? ఒక పార్టీ అధికారంలోకి వస్తే 'ప్రజా' ఉంటుంది. మరో పార్టీ అధికారంలోకి వస్తే 'ప్రజా' పోతుంది. వెరసి ఏ పార్టీ ఎప్పుడు ఉంటుందో - ఎప్పుడు పోఉందో తెలీక 'ప్రజా' అనే పదాన్ని ఉంచాలో లేదో తెలీక ఉపాయంతో కుండలీకరణంలో ఉంచేసి ఊపిరిపీల్చుకున్నారు.

ప్రభుత్వం 'ప్రజ'లతో ఆడుకోవటమంటే ఇదేనండీ బాబూ!

విద్యార్థులు ఎదురుగా వచ్చి నమస్కరిస్తున్నారు. ఎంత వినయం! ప్రార్థన జరుగుతోంది. స్పష్టంగా, కు.చ. తప్పకుండా తప్పులు పోకుండా, రాగయుక్తంగా, భావయుక్తంగానూ జాతీయ గీతాన్ని ఆలపిస్తున్నారు విద్యార్థులు.

'ప్రతిజ్ఞ' గొంతెత్తి చదువుతున్నారు. దేశభక్తి పొంగిపొర్లుతోంది.

తరగతి బెల్ అయింది. నా తరగతికి వెళ్ళాను. ముప్పై ఐదు మంది విద్యార్థులున్నారు.

'మిగతా ముప్పై మంది ఏ పెళ్ళికైనా, జాతరకైనా వెళ్ళారా?' ప్రశ్నించాను పిల్లల్ని.

'మేం ముప్పై మందిమేగా మేడం' అన్నారు వాళ్ళు.

నా తరగతి సంఖ్య ఇలా తగ్గిపోయిందేమిటి చెప్మా, కలా, నిజమా? రూమంతా కలియజూశాను.

గది విశాలంగా ఉంది. ధారాళంగా వెలుతురు వస్తోంది కిటికీల్లోంచి. గమనించలేదుగానీ... విద్యార్థులందరికీ డెస్కులున్నాయి. తట్టుకోలేక పోతున్నాను ఈ విచిత్రాన్ని.

విద్యామంత్రికి తప్పకుండా భేతాళుడు వశమయ్యే ఉంటాడు. విద్యార్థులు వినయంగా ఉన్నారు. ఒకరిద్దరు తప్ప అందరూ పాఠాలు వ్రాశారు. పద్యాలు కంఠస్థం చేశారు.

బెల్ కొట్టారు. బెల్ ఏమిటీ ఆగకుండా మోగుతూనే ఉంది?...

తలుపులు దబదబా బాదిన చప్పుడు.

ఉలిక్కిపడి నిద్రలేచాను. ఇదంతా కలా? నా మధురస్వప్నం చెదిరిపోయింది.

సైకిలో బెల్ చప్పుడికి నిద్రలేచే నేను ఇంకా లేవలేదని పాలవాడు తలుపులు అదేపనిగా బాదుతున్నాడు. లేచి వెళ్ళి పాలుపోయించుకున్నాను. పాలా? నీళ్ళా?

"వట్టి నీళ్ళపాలు" నోటివరకూ వచ్చిన మాటని నోట్లోనే ఆపుకున్నాను.

పైకి అంటే అతడిచ్చే సమాధానం మాటల్లో కాక చేతల్లో ఉంటుంది. వరుసగా మూడురోజులు పత్తాలేకుండా పోతాడు. కారణమడిగితే ఏఊరికో వెళ్ళానని సాకులు చెప్తాడు.

★ ★ ★

యథావిధిగా బస్‌స్టాప్‌లో నిలుచున్నాను. ఎటుచూసినా జనం జనం! ఎక్కడికి వెళ్తారో ఇంతమందీ రోజూ? ఎదురు చూడగా చూడగా నిండు చూలాలిలా వచ్చింది బస్సు.

ఇది మిస్సయితే మరో గంటదాకా బస్‌లేదు. ఎలాగోలాగ కాలుమోపగలిగాను.

కిక్కిరిసిన జనంతో బయలుదేరింది మా పుష్పక విమానం!

డోర్ దగ్గరే నిలబడ్డాను కాబట్టి బయటికి చూశాను. రాత్రికలలో చూసిన తారు రోడ్డు స్థానంలో ఇప్పుడు కంకర తేలిన గతుకుల రోడ్డు వెక్కిరిస్తోంది.

బస్ వేగానికి దుమ్ము లేస్తోంది. రోడ్డుకి ఏ వైపునా ఒక్క వృక్షరాజమూ లేదు. అక్కడక్కడ దూరంగా చేతిపంపుల ద్వారా సాగుచేసుకుంటోన్న వ్యవసాయభూములు.

నా గమ్యస్థానం చేరుకున్నాను. బ్రతుకు జీవుడా! అని దిగి ఊపిరి పీల్చుకున్నాను. నడుస్తున్నాను.

పశువుల కొట్టాలు కన్పించాయి. ఎండిపోయిన జీవాలు తోకలూపుకుంటూ ఈగల్ని తోలుకుంటున్నాయి.

నేను నడుస్తూన్నాను. దారిలో చేతిపంపులు ఉన్నచోట దాదాపు ఓ యాభైమంది స్త్రీలూ, పిల్లలూ, వృద్ధులూ, యువతులూ కనిపించారు.

కొందరు మాట్లాడు కుంటున్నారు - కొందరు పోట్లాడుకుంటున్నారు. వెరసి గందరగోళంగా ఉంది.

కలలో కనిపించిన అందమైన దృశ్యానికీ - వాస్తవానికీ ఎంతతేడా! వాస్తవం ఎంత చేదుగా ఉంది! గ్రామాలెంత దౌర్భాగ్య స్థితిలో ఉన్నాయి. నా మధురస్వప్నం నిజమవుతుందా?

"నిజంగానే నిఖిలలోకం నిండు హర్షం ప్రకటిస్తుందా?

నిజంగానే మానవాళికి మంచికాలం వరిస్తుందా!"

మహాకవి శ్రీ శ్రీ మాటలు గుర్తుకొచ్చాయి!

★




ఇ.వెంకటేశ్వరరావు,ఇ.నం.64-17-3/ఎ, ప్రతాప్‌నగర్, కాకినాడ-4.